క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీఏడీఈ ప్రకటించారు. బుధవారం అత్తాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు, సిద్ధిఖ్‌గుల్షన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, బోంఢల్‌గూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు, హైదర్‌గూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు, శివాలయం, జనప్రియ ఏబీసీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా మహేశ్వర్



యాకుత్‌పురా: బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా యాకుత్‌పురాకు చెందిన సీనియర్ నాయకుడు కామాటి మహేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నాయకత్వం ఆయనను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1989 నుంచి పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా చేరి నగర బీజేవైఎం కార్యవర్గ సభ్యుడిగా, ఇమ్లిబన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా, మీడియా సెల్ నగర జాయింట్ కన్వీనర్, గ్రేటర్ కార్యవర్గ సభ్యుడిగా, గత ఆరేళ్లుగా వరుసగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సేవలందిస్తున్నారన్నారు. తన సేవలను గుర్తించి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు నిరంజన్‌యాదవ్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైతుల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చిస్తాం



సమావేశంలో అనంత కృష్ణ

గన్‌ఫౌండ్రీ: బీజేపీ యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతకృష్ణకు అరుదైన అవకాశం దక్కింది. గుజరాత్ రాష్ట్రంలో జాతీయ స్థాయిలో జరుగనున్న పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులచే రైతుల సమావేశానికి ఆయనకు ఆహ్వానం దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం అబిడ్స్‌లోని రాష్ట్ర కార్యాలంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన ఎరువుల తయారీ కంపెనీ నిర్వహించిన జాతీయ స్థాయి సమావేశంలో హాజరు కావడం ఆనందంగా ఉందని, రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయిలో తెలియజేస్తానని తెలిపారు.

సినీ పరిశ్రమలో.. యేసు దాసుది చెరగని ముద్ర



కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల చైర్మన్లు

గన్‌ఫౌండ్రీ: తెలుగు చిత్ర పరిశ్రమలో గాయకుడు పద్మవిభూషణ్ డాక్టర్ కేజే యేసుదాసు చెరగని ముద్ర వేసుకున్నారని పలువురు ప్రముఖులు కొనియాడారు. మంగళవారం రవీంద్రభారతిలో మాంగళ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో యేసుదాసు 83వ జన్మదినాన్ని పురస్కరించుకుని 'స్వరరాగ గంగా ప్రవాహమే' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించగా పలువురు గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ రావు, అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి, గౌడ హాస్టల్ చైర్మన్ పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్, మాంగళ్యం ఫౌండేషన్ చైర్మన్ బత్తిని కీర్తిలత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రోహిన్‌రెడ్డి



గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగుతుందని డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డి అన్నారు. ఆయన ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆయనను కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. కాంగ్రెస్ నాయకులు కృష్ణ, చంటిబాబు, రఘుపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, అబ్దుల్ హమెద్, వినోద్‌సింగ్, రాంకుమార్, సతీష్ తదితరులున్నారు.

పతంగ్ లావో.. పేంచ్ దాలో..

ధూల్‌పేట్‌లో మొదలైన పతంగుల సందడి



- విక్రయాలకు సిద్ధంగా ఉన్న పతంగులు, మాంజాలు
- కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న ధూల్‌పేట్

జియాగూడ: ధూల్‌పేట్‌లో గాలిపటాల సందడి నెలకొంది. ప్రతిరోజు నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం ప్రజలు ధూల్‌పేట్‌కు చేరుకుని కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి పండుగ చేరువ కావడంతో ధూల్‌పేట్‌లో విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ధూల్‌పేట్‌లోనే గాలిపటాలు, మాంజాలు ఇళ్లల్లో తయారవుతుండటంతో తక్కువ ధరకే లభిస్తుంటాయి. దీంతో హోల్‌సేల్, రీటైల్ విక్రయదారులు ధూల్‌పేట్‌కు చేరుకుని కొనుగోలు చేస్తారు. సుమారు వందేళ్ల నుంచి ధూల్‌పేట్‌కు చెందిన లోధ క్షత్రీయులు చేతివృత్తుల పైనే ఆధారపడి ఉంటున్నారు. ముఖ్యంగా గాలిపటాల తయారీ, గణేష్, మాతేశ్వరీ విగ్రహాలు, బొమ్మలు, రాఖీలు తదితరాలు ఏడాది పొడవునా ఇళ్లల్లో కుటీర పరిశ్రమల తరహాలో తయారు చేస్తూ పండుగ వేళల్లో విక్రయాలు చేస్తుంటారు. సుమారు 250కి పైగా గాలిపటాల అమ్మకాలకు గాను దుకాణాలు వెలిశాయి.

ఆకర్షనీయంగా గాలిపటాలు..

ధూల్‌పేటలో గాలిపటాలను వివిధ రంగులు, డిజైన్లు, డెకరేషన్లతో ఆకర్షనీయంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా పేపర్, పాలిథిన్, డెకరేషన్ గాలిపటాలు వివిధ డిజైన్లలో లభిస్తున్నాయి. ముఖ్యంగా జిబియా, డోక్లం, చాంద్‌తారా, అష్టవా, తిరంగా, ఆసా, స్పైడర్‌మెన్, స్కైబర్డ్, హింగ్వా, ఈగల్, బటర్‌ఫ్లై, లెమన్, చీల్, ఫైటర్, డ్రాగర్, ఫ్లయింగ్ బర్డ్, వర్ధమెన్ ఎన్నో రకాలు కొనుగోలు చేస్తున్నారు.

పవర్‌ఫుల్ మాంజాలు..

గాలి పటాలను ఎగురవేయడంలో మాంజాలు చాలా కీలకం. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో గాలిపటాలు పోటీలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా పోటీలో నిలిచిన వారిలో ఎవరి గాలిపటం చివరి వరకు తెలకుండా ఉంటుందో వారిని విజేతలుగా ప్రకటించడంతో పాటు బహుమతులు కూడా ప్రదానం చేస్తుంటారు. పోటీల్లో కీలకంగా ఉండే మాంజాలను పోటాపోటీగా కొనేందుకు కొనుగోలుదారులు వస్తుండగా అమ్మేందుకు విక్రయదారులు సైతం సిద్ధంగా ఉన్నారు. త్రెడ్, ఫిరికి, నైలాన్ మాంజా, మైదాని దూలా మాంజాల విక్రయాలు జరుగుతుండగా చైనా మాంజాను మాత్రం పూర్తిగా నిషేధించారు.





ధూల్‌పేట్‌లో పతంగుల విక్రయాలు

కిటకిటలాడుతున్న మార్కెట్లు..

ధూల్‌పేట్‌తో పాటు బేగంబజార్, ఛత్రి, జుమ్మెరాత్ బజార్, పురానాపూల్, గాంధీ స్టాచూ, మంగళ్‌హాట్, సిద్దిఅంబర్‌బజార్ తదితర ప్రాంతాల్లో కూడా పేరుమోసిన గాలిపటాల దుకాణాలు జోరుగా విక్రయాలు చేస్తున్నాయి.



రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మామ పాకాల హరినాథ్‌రావు ఇటీవల మృతిచెందగా మంగళవారం నిర్వహించిన శ్రద్ధాంజలి సభ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌ను కలిసిన గోషామహల్ నియోజకవర్గానికి రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు నందకిశోర్ వ్యాస్. - అబిడ్స్

అభినందన



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ జట్టు మహారాష్ట్ర షిర్డిలో 27వ సీనియర్, జూనియర్ అండ్ సబ్ జూనియర్ నేషనల్ రోడ్డు సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనింది. ఈ పోటీల్లో రెండోరోజు 120 కిలోమీటర్ల మాస్టర్‌రేస్‌లో యశ్వంత్ అండర్-23 పురుషుల విభాగంలో రజత పతకాన్ని సాధించారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ తరఫున టీసీఏ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ, కోశాధికారి విజయకాంత్‌రావులు అతడిని ప్రత్యేకంగా అభినందించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



కేలండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎస్ఎం హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు సేవారత్న డాక్టర్ ఎస్ఎం హుస్సేని (ముజీబ్) పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. సంఘం భవనంలో మహిళాభివృద్ధి, శిషు సంక్షేమశాఖ 2023 నూతన కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో శంకర్, ఖురేషి, శైలజ, హరిప్రియ, కవిత, సంధ్య, దీపిక, సరిత, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు పర్యాటక శోభ



గోల్కొండ: భారీ సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోట నిండుకుండను తలపించింది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం నుంచే కోట బుకింగ్ కౌంటర్ల వద్ద పర్యాటకులు బారులు తీరారు. పర్యాటకులకు గోల్కొండ కోట విశిష్టతను ప్రత్యేక గైడ్స్ వివరించారు. నేటికి చెక్కు చెదరని రాణీమహల్, అక్కన్న మాదన్న కార్యాలయాలతో పాటు భక్తరామదాసు, షాదీఖానాను పర్యాటకులు ఎంతగానో తిలకించారు. పలువురు యువకులు, యువజంటలు కోట గోడల వద్ద నిలబడి సెల్ఫీలు తీసుకుని సంబరపడ్డారు.

క్రీడలతో ఎంతో మేలు



గెలుపొందిన క్రీడాకారులతో హెడ్ కోచ్ వేణు

గన్‌ఫౌండ్రీ: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఉత్తేజాన్ని కలిగిస్తాయని మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ శ్రీకాంత్ అన్నారు. మ్యాచ్‌పాయింట్ బాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, షెటిల్ రాకెట్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో మ్యాచ్‌పాయింట్ బాడ్మింటన్ అకాడమీ హెడ్ కోచ్ ముప్పాల వేణు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్పత్రులు తదితర అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా మంగళవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గోల్కొండ ఏరియా ఆసుపత్రితో పాటు నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలను అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్‌ఉద్దీన్ ఉన్నారు.

నృత్య గురువుకు సత్కారం



సువర్ణలతను సత్కరిస్తున్న రత్నకుమారి

నాంపల్లి: ప్రముఖ నృత్య గురువు నెమలికంటి సువర్ణలత వద్ద శిష్యరికం పొందిన మూడు తరాల శిష్య పరంపర ఒకే వేదికపై ప్రత్యక్షమయ్యారు. సోమ వారం రాత్రి తెలుగు వర్సి టీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన శిష్యులంతా గురువు నెమలికంటి సువర్ణలతను ఘనంగా సత్కరించారు. శిష్య బృందం లతా మంజూష, మధులిక, చరితా, జాహ్నవి, వి.లక్ష్మి, సాహిత్య ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను కనువిందు చేశాయి.

బ్రౌంజ్ మెడల్ విజేతకు ఘన సత్కారం



గోపాల్ యాదవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: హింద్ కేసరి టైటిల్ బ్రౌంజ్ మెడల్ సాధించిన గోపాల్ యాదవ్‌ను బేగంబజార్‌లో ఘనంగా సత్కరించారు. జాతీయ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ పోటీలలో బేగంబజార్ ఓం వ్యాయమ శాలకు చెందిన గోపాల్‌యాదవ్ 80 కిలో విభాగంలో బ్రౌంజ్ మెడల్ సాధించాడు. మంగళవారం బేగంబజార్‌లో విజేతగా నిలిచిన గోపాల్‌యాదవ్‌ను యాదవ సమాజ్ నిర్వాహకులు, ఓం వ్యాయమశ్యాల సభ్యులు ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ యాదవ్ మాట్లాడుతూ.... లల్లూ వస్తాద్ సహకారంతో బ్రౌంజ్ మెడల్ సాధించానన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కుస్తీ పోటీలలో తన సత్తా చాటేందుకు విశేషంగా కృషి చేస్తానన్నారు. తనకు సహకరించిన లల్లూ వస్తాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

యాకుత్‌పురా: గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.సుబ్బయ్య డిమాండ్ చేశారు. పురాణి హవేళి సిటీ సివిల్ కోర్టులోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన 4 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. న్యాయశాఖ ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, జీపీఎఫ్ బిల్లులు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా నూతన పీఆర్‌సీని ప్రవేశపెట్టి పెండింగ్‌లో ఉన్న బిల్లులను సకాలంలో చెల్లించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్ జిల్లాలో న్యాయశాఖ ఉద్యోగులపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి



గోల్కొండ: యాదవుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ అన్నారు. కార్వాన్ యాదవసంఘం ప్రతినిధులు మంగళవారం ఆయనను కలిశారు. డైరీ ఫారాల వద్ద తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యలను యాదవ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చి వినతిపత్రం అందజేశారు. జలమండలి, శానిటేషన్ అధికారులతో మాట్లాడి ఈ సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చినట్టు సమాచారం. యాదవ సంఘం అధ్యక్షులు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందేశ్‌యాదవ్, మధుసూదన్‌యాదవ్, లక్ష్మీకాంత్ యాదవ్ తదితరులున్నారు.

హడావుడి లేకుండా అసదుద్దీన్ పర్యటన

- బుల్లెట్ బండిపై బహదూర్‌పురా నియోజకవర్గంలో పర్యటించిన హైదరాబాద్ ఎంపీ
- రూ.122.80 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం



బుల్లెట్ బండిపై వెళ్తున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

చార్మినార్: హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మంగళవారం బుల్లెట్ బండిపై పాతబస్తీలో పర్యటించారు. బండిపై వెళ్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.122.80 కోట్ల నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయన మంగళవారం ప్రారంభోత్సవాలు చేశారు. బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గం ఫలక్‌నుమా డివిజన్‌లోని కింగ్స్ అవేస్ కాలనీ, మేరాజ్ గార్డెన్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే మోజం ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన దూద్‌బౌలి ప్రాంతానికి చెందిన మజ్లిస్ పార్టీ యువ నాయకులు దీపేశ్ రాజ్ వర్మకు చెందిన బుల్లెట్ బండిపై వెళ్తూ ఈ ప్రారంభోత్సవాలను చేశారు. కగా మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు.

నుమాయిష్‌లో 'లేడీస్' సందడి



సందడి చేస్తున్న మహిళలు

గన్‌ఫౌండ్రీ: నుమాయిష్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా ఒకరోజు కేటాయించడం ఎంతో అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవి దేవి అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో మంగళవారం మహిళా దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని లేడీస్ స్పెషల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....ఎంతో చరిత్ర కలిగిన నుమాయిష్‌లో ప్రతియేటా మహిళలకు ఒకరోజు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ మహిళా విభాగం కన్వీనర్ వనం ఉష మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల మంది మహిళలు నుమాయిష్‌ను సందర్శించినట్లు తెలిపారు. అనంతరం పలు స్టాళ్లను సందర్శించారు. అంతకు ముందు సరోజినీనాయుడు వనిత మహిళా కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళా విభాగం జాయింట్ కన్వీనర్లు నీలావతి, సలహాదారు ప్రవీణారెడ్డి పాల్గొన్నారు.

సమాజానికి మంగలి కులస్తుల సేవలు ఎనలేనివి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్

సుల్తాన్‌బాజార్: ఆధునిక సమాజ నిర్మాణంలో ప్రగతి కారకులైన మంగలి కులస్తుల సేవలు ఎనలేనివని తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. నాగరికత రూపకల్పనలో మానవ సమాజానికి వీరి సేవలు అనితర సాధ్యమైనవన్నారు. మంగళవారం బొగ్గుల కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం 2023 నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరటాల యాదగిరి, రిజిస్ట్రార్ కోఆపరేటీవ్ సొసైటీ రిటైర్డ్ ఎస్.రామనంద స్వామి, కంటెస్టు ఎమ్మెల్సీ మల్లగల గురప్ప, క్రిమినల్ కోర్టు సీనియర్ అడ్వకేట్ భూపాల్, రాష్ట్ర కార్యదర్శి ఎం.రామచందర్, రాజ్, హరినాథ్, శ్రీనివాస్, ప్రముఖ కవి డాక్టర్ రాపోలు సుదర్శన్, శ్రీధర్, యాదాద్రి కల్యాణకట్ట అధ్యక్షుడు జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న తెలంగాణ బాలసాహిత్య సమ్మేళనం

సుల్తాన్‌బాజార్: మొట్టమొదటి తెలంగాణ బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించాలని తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్ణయించింది. ఫిబ్రవరి 5న హైదరాబాద్‌లో అబిడ్స్ తిలక్‌రోడ్డులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగే ఈ సమ్మేళనంలో బాలసాహిత్య స్వరూపం, తెలంగాణలో బాలసాహిత్య వికాసం, పాఠశాలలు-లలిత కళావేదికలు, బాల మేధావులతో ముఖాముఖి అని నాలుగు సదస్సులుంటాయి. బాల సాహిత్య రచయితలను, పాఠశాల స్థాయిలో బాలలను రచయితలుగా మలచే విషయంలో విశేష కృషినందిస్తున్న ఉపాధ్యాయులను ఒక వేదిక మీదకు తేవడం లక్ష్యమని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు సదస్సుల్లో ప్రసంగించే వక్తలను పరిషత్తు ఎంపిక చేస్తోంది. బాల సాహిత్య రచయితలు పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించి రచనలకు ప్రాచుర్యం కల్పిస్తున్న ఉపాధ్యాయులు ప్రతినిధులుగా పాల్గొనవచ్చని, ఈ నెల 20వ తేదీలోగా సెల్: 9603727234 వాట్సాప్ నంబర్‌లో తమ పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తమ కృషి గురించి క్లుప్తంగా పేర్కొనవలసిందే కాకుండా దాని ఆధారంగానే ఎంపిక జరుగుతుందన్నారు. ప్రతినిధులు తమ సొంత ఖర్చులతో రావాల్సి ఉందన్నారు.

షేక్‌పేట్ నాలా.. ట్రాఫికర్!



షేక్‌పేట్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం వద్ద ఇలా..

గోల్కొండ: ప్రధాన రహదారులపై ఇష్టానుసారంగా వాహనదారులు అక్రమ పార్కింగ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోకపోగా పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను సీజ్ చేసి భారీ ఛలాన్లు విధించాలని పలువురు కోరుతున్నారు.

- ప్రధానంగా టోలిచౌకి నుంచి దర్గాకు వెళ్లే పాత ముంబాయి జాతీయ రహదారిపై గత కొన్ని రోజులుగా ద్విచక్ర వాహనాలే కాకుండా కార్లు కూడా అక్రమంగా పార్క్ చేసి ఉంటున్నాయి. ముఖ్యంగా షేక్‌పేట్ కొత్త ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా ఉన్న రోడ్లపై రోడ్డును ఆక్రమిస్తూ కార్లను పార్క్ చేస్తున్నారు.
- అసలే రద్దీగా ఉండే ఈ రోడ్లపై అక్రమ పార్కింగ్‌లతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 10 వరకు పాత ముంబాయి జాతీయ రహదారిపై వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.
- షేక్‌పేట్ నాలా నుంచి టోలిచౌకికి వెళ్లే రోడ్డుపై రాఘవేంద్ర హోటల్, బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం, టోలిచౌకి ఫ్లై ఓవర్‌ను ఆనుకుని ఉన్న పలు రెస్టారెంట్ల ముందు కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు.
- టోలిచౌకి నుంచి దర్గాకు వెళ్లే పాత ముంబాయి జాతీయ రహదారిపై ఆడమ్స్ రెస్టారెంట్, రత్నదీప్ సూపర్‌మార్కెట్, షేక్‌పేట్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, కరాచీబేకరి, డీ-మార్ట్ తదితర ప్రాంతాల ముందు రోడ్లపైనే కార్లు, ద్విచక్ర వాహనాలు పార్క్ చేసి ఉంటున్నాయి.
- బహుళ అంతస్తుల భవనాల్లో కొనసాగుతున్న రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లకు ఒక్క ఇంచ్ కూడా పార్కింగ్ ప్రదేశం లేదు. పలు భవనాలకు సెల్లార్లు ఉన్నా కూడా అవి కూడా పార్కింగ్‌లకు కేటాయించలేదు.
- ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పలు ఫంక్షన్ హాల్‌లు, బాంక్వెట్ హాళ్ల వద్ద కూడా రోజూ వందల సంఖ్యలో వాహనాలు రోడ్లపై నిలుపుతున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



యాకుత్‌పురా: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ అధికారులను అదేశించారు. మంగళవారం ఆయన కార్పొరేటర్లు, పలు విభాగాల అధికారులతో కలిసి నియోజకవర్గ పరిధిలోని డబీర్‌పురా, గంగానగర్ నాలా, కామేలేకా మసీద్, షేక్ ఫయాజ్ కమాన్, బడా బజార్, బ్రహ్మణవాడి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డబీర్‌పురా, రెయిన్‌బజార్ డివిజన్ల పరిధిలో కొనసాగుతున్న డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, నాలా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్లు అలాందార్ వాలా జాహి, మహ్మద్ వసీవుద్దీన్, జలమండలి సీజీఎం వినోద్‌భర్గవ్, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఈఈ బసవరాజు, మజ్లిస్ పార్టీ నేతలు మహ్మద్ అలీఖాన్, ఖైసర్, మీర్ షోహెబ్ అలీ పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు

గోల్కొండ: షేక్‌పేట్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను ఇంటింటికి మజ్లిస్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఈ పథకంలో భాగంగా తాను ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు.